# తొలిమెట్టు

పోల్కంపల్లి శాంతాదేవి

"మదన పాసయ్యాడు నాన్నా!"

పేపరు తీసుకొని తండ్రిగదిలోకి వచ్చింది సత్యభామ.

"క్లాసువచ్చిందా?" మామూలు విషయంగానే చిరుసంతోషం ప్రదర్శించాడు ఆయన.

"వాడికి రాకపోతే మరెవరికి వస్తుంది?"

చిరునవ్వు నవ్వాడు తండ్రి. "ఈమధ్య వాడేవో సాంఘిక సేవా కార్యక్రమాలంటూ తిరుగుతున్నాడుకదా? కొంచెం చదువును అశ్రద్ధచేస్తున్నాడనిపించింది."

"వాడెప్పుడూ పుస్తకం కరుచుకు కూర్చోగా చూడలేదు. అయితే, క్లాసు లేకుండా ఎప్పుడూ పాసుకాలేదు. వాడు ఏక సంథాగ్రాహి."

మధ్యాహ్నం భోజనంచేసి పేపరుకోసం బయటికి వెళ్ళిపోయిన మదన రాత్రిపద్దాక గాని ఇంటికిరాలేదు. పరీక్ష తప్పినవాడికీ, అతడి ముఖవైఖరికీ అంతగా తేడాలేదు. ఆనందసమయంలో ఎగిరి గంతువేయడం, దుఃఖసమయంలో విచారంతో క్రుంగిపోవడం అతడి స్వభావంకాదు. అతడెప్పుడూ గుంభనంగా, మౌనంగా ఉంటాడు.

అయితే, మిగతా కుటుంబసభ్యుల్లో కూడా స్తబ్ధత, గంభీరత నిండిపోయాయి. అతడిని చూస్తూనే ఎవరూ పరీక్ష ఫలితాల సంగతే ఎత్తలేదు.

తల్లే భోజనాలదగ్గర కదిపింది. "ఇంత తెలివైన నాతండ్రిని పైకి చదివించేస్థోమత లేకుండాపోయింది. క్లాసువచ్చిందని మురిసిపోవడానికి కూడా లేదు. బాగా సిరిసంపద లున్న ఆరోజుల్లోనైనా..."

అలవాటుగా, కరిగిపోయిన కలిమి గురించి, గతవైభవం గురించి ఆవిడ వాపోవడం మొదలుపెట్టీ పెట్టకముందే భోజనం ముగించి వెళ్ళిపోయాడు మదన.

"మదన్!"

షర్ట్‌వేసుకొని వెళ్ళిపోతున్న మదన తండ్రి పిలుపువిని గదిలోకి వచ్చాడు.

"ఇక ముందుసంగతి ఏమాలోచించావు బాబూ?"

"ఎక్కడైనా ఉద్యోగప్రయత్నమే."

స్కూల్‌ఫైనల్ ప్రథమతరగతిలో, ప్రథముడిగా ప్యాసయ్యాడన్న ఉత్సాహంకొద్దీ ముందువెనక ఆలోచించకుండా బి.ఎ. లో చేర్పించి, ఇదికాస్తా గట్టెక్కించడానికి తండ్రి ఎన్ని బాధలకు, ఇబ్బందులకు, లోను కావలసివచ్చిందో గుర్తువస్తే మదన మనసు తీవ్రంగా కలతపడుతుంది. ఇప్పుడు తండ్రి చదివించగలనన్నా అతడు తలూపడానికి తయారుగాలేడు.

"ఇప్పుడే ఆ నిర్ణయానికి రానక్కర లేదులే. రేపు ఒకరిద్దరితో కలసి ముందు చదువుకు వీలుపడుతుందేమో చూస్తాను. ప్రయత్నం అనుకూలించనిపక్షంలో..."

"ఊహూ. మిమ్మల్నిక శ్రమపెట్టే ఉద్దేశ్యం నాకులేదు. నేను చదవను. నే నిదివరకే ఉద్యోగప్రయత్నాలు మొదలుపెట్టాను."

"సరే అయితే..." కొడుకు నిశ్చయానికి ఆయన తలూపక తప్పలేదు. "డబ్బో. పలుకుబడో లేకుండా మనం ఆశించినంత త్వరగా ఉద్యోగాలు దొరకవుకదా? టెంపరరీగా కావాలనుకొంటే – అది నీకు నచ్చుతుందికూడా, రామమోహన్‌రావని నా స్నేహితుడు, బహుశా నువ్వుచూచి ఉండొచ్చుకూడా – కోటీశ్వరుడు ఇక్కడేదో సేవాసదనం, బళ్ళూ నడుపుతున్నాడు. అతడు ఉండేదిమాత్రం కంఠిలో. అక్కడ వ్యవసాయం, తోటలు చూచుకొంటూ, ఇక్కడికి వస్తూపోతూ ఉంటాడు. అతడినికలిస్తే ఈ సేవాసంస్థల్లోనే ఏదైనా ఉద్యోగం ఇవ్వగలడనుకొంటా. ఏం? కలుస్తానంటావా?"

"అలాగే. కలిసి చూస్తాను."

* * *

చాలా చిన్నస్టేషను అది. ట్రెయిన్‌దిగి టికెట్ఇచ్చేసి ఇవతలికి వచ్చేశాడు మదన.

"కంఠి ఎంతదూరమండీ ఇక్కడికి?"

"దూరంగా కనబడుతున్నదే, అదే. కాలిబాటన వెడితే మైలుఉంటుంది. బండ్లదారి అయితే కొంచెం చుట్టు."

నడక సాగించాడు మదన. చాలావరకు పొలాల గట్లమీద వెడుతుంది బాట.

ఇంకా వర్షరుతువు ప్రారంభం కాలేదు. చుట్టూ వరిమళ్ళు పగుళ్ళు విచ్చిపోయాయి.

వరి గంట్లు మేస్తూ అక్కడక్కడా పశువులు కనబడుతున్నాయి.

ఆహ్లాదంగా లేదు ప్రకృతి. మేతలులేక బక్కచిక్కిన పశువులు, బీటలువారిన నేల, ప్రొద్దుగ్రుంకుతున్నా చల్లబడని గాలి.

శ్రీమంతుడైన రావుగారి నివాసం ఏ అధునాతన భవంతిలోనో అనుకొన్నాడుగాని విశాలంగావున్న చాలా పాతకట్టడమే అది. మదన వెళ్ళిన సమయంలో రావుగారు కొంచెం అస్వస్థతగా ఉండి పడకగదిలో విశ్రాంతి తీసుకొంటున్నారు. ఎవరోఅబ్బాయి తనను కలుసుకోడానికి వచ్చాడని తెలిసి వరండాలోకి వచ్చారు.

"కూర్చో బాబూ," చిరునవ్వుతో, ఆప్యాయంగా మదనను కూర్చోజేసి అతడి రాక వివరాలు అడిగారు. "రఘునాధరావు కొడుకువా ?" అన్నారు సంతోషంగా.

ఏమో అనుకొన్నాడు మదన. కోటీశ్వరుడుకదా, ఇవతలివాళ్ళతో తామరాకు మీది నీటిబొట్టులా (ఐశ్వర్య గర్వంతో) అంటీ అంటనట్టు వ్యవహరిస్తాడేమో – ఏవోఅనాధ శరణాలయాలు, విద్యాసంస్థలు నడిపినా – ఈ రోజుల్లో పేరుకోసం నడిపేవాళ్ళే ఎక్కువ కదా...ఇలాంటి ఊహలతో వచ్చాడు. కాని, రావుగారు చాలా ఆత్మీయంగా, సనాతన భావాలు జీర్ణించుకొన్నవారుగా, యధార్ధ జీవిగా కనిపించారు. 'నాన్నకు ఇంతమంచి స్నేహితుడున్నాడా?' అనుకొన్నాడు సంతృప్తిగా.

"నమస్కారమండీ."

తనతండ్రితో రావుగారు తన చిన్ననాటి స్నేహంగురించి చెబుతూంటే, తలవంచుకుని వింటూన్న మదన ఉలికిపడి తలెత్తాడు.

"మా అమ్మాయి రోహిణి. బి.ఎ. పాసైంది ఈఏడే.''

నవ్వింది రోహిణి. ''మీరు పరిచయం చేయడమేమిటి నాన్నా, ఇద్దరం క్లాస్ మేట్సుమైతే !''

"**అయితే**, రెండువిధాలుగా మనకు దగ్గరవాడన్నమాట." తన స్నేహితుడి కొడుకుగా పరిచయం చేశారు మదనను.

''ఎక్కడికో వెళ్ళి వస్తున్నారు ?"

''సెలవుల్లో ఇక్కడికి వచ్చానంటే నాకేం తోచదు. పుస్తకాలైనా ఎన్నని దొరుకుతాయి ? మంచి కాలక్షేపంగా తోటపని ఎన్నుకొన్నాను. భోజనం నిద్రా తప్ప నా కాలమంతా మా తోటలోనే గడిచిపోతుంది.

''ఉహూ." ఇద్దరూ మూడేళ్ళుగా సహపాఠకులైనా ఒకరిపేరు ఒకరికి తెలియడం తప్ప ఎప్పుడూ మాట్లాడుకొనే అవకాశం రాలేదు. మదన బాగా చదివే తెలివైన కుర్రాడుగా, ఆడవాళ్ళను పూసుకుతిరిగే స్వభావం కాదుగాని, సోషల్‌గా నలుగురిలో ఆప్యాయంగా మసలగలడని, అవసరం లేకపోతే అతడంత నిర్లిప్తుడు మరొకడుండడని అలాంటి అభిప్రాయం ఉంది రోహిణికి. రోహిణి గురించి అతడికీ మంచి అభిప్రాయమే ఉంది. ఒకరి గొడవ పట్టని, తన చదువేమో తనేమో చూచుకొనే బుద్ధిమంతురాలైన అమ్మాయి అని. అందుకు తగినట్టుగా చాలామంది ఆడపిల్లలవలె చెడ్డకథలేవీ అతడి చెవిలో పడలేదుకూడా.

మదన సర్టిఫికెట్లు చేతికి తీసుకొని చూచిన రావుగారి ముఖంలో సంతృప్తి రేఖలు స్పష్టంగా గోచరించాయి. "ఇంత తెలివైన కుర్రాడివే! చదువులో గొర్రెతోకలా ఉండిపోవడమేమిటి ? నువ్వుబాగా చదువుకోవాలి. నీ వయసుకూడా ఇప్పుడు ఉద్యోగం చేయవలసిందీ, బాధ్యతల నెత్తికెత్తుకోవలసిందీ కాదు."

"కాకపోవచ్చు. మా ఆర్థిక పరిస్థితి బాగాలేదు. ఉద్యోగం తప్పనిసరి.''

ఎక్కువగా తర్కించలేదు రావుగారు. "సరే. నేను నాన్నగారితో మాట్లాడతాను. రేపో ఎల్లుండో నేను పట్నం రావలసిన పని వుంది.''

మదన లేచాడు. "నేనిక వెళ్ళివస్తాను."

"నువ్వు స్టేషన్‌కు నడిచేప్పటికి బాగా చీకటి పడిపోతుంది. వెన్నెలరోజులైనా కాదు. రేపు ఉదయం వెళ్ళొచ్చు. ఈ రాత్రికి వుండిపో అబ్బాయ్ !"

"అవునండీ. ఎలాగా నేను రేపు రావలసిన పనివుంది. ఇద్దరం కలసి వెళ్ళవచ్చు. ఈ రాత్రి మాకు అతిథిగా ఉండిపొండి" అన్నది రోహిణి.

పెద్దగా వ్యతిరేకత వ్యక్తపరచలేదు మదన.

* * *

"మరి నాకు సెలవా ?" కారు స్టార్ట్ చేయబోతూ అంది రోహిణి చిరునవ్వుతో.

"అభ్యంతరం లేకపోతే ఇంట్లోకివచ్చి కొద్దిగా టీ తీసుకువెళ్ళండి." చిరునవ్వుతో ఆహ్వానించాడు మదన.

సీటుమీద కూర్చొనే సంకోచంగా ఇంటి గుమ్మంలోకి చూచింది రోహిణి. ఇంచుక లజ్జతో కూడిన మందహాసం ఆమె పెదవి వంపులను మరింత ఆకర్షణీయంగా తీరుస్తూంటే "రమ్మంటారా ?... ఇంట్లో..."

సూటిగా ఆమె ముఖంలోకే చూస్తున్నాడేమో ఒకక్షణం ఏదోలా అయ్యాడు మదన. ప్రకృతిలో అందాలు అనేక రూపాలుగా ఉండవచ్చు. కాని, హృదయాన్నిస్పందింపజేసే అందం చాలా అరుదుగా దృశ్యమౌతుంది. అది తొలి అనుభవమైతే ? కవులు ఆ ఘట్టాన్ని మధురస్వప్నంగా, ఇంద్రజాలంగా చాలా పేర్లతో వర్ణిస్తారు!

గతితప్పిన భావాన్ని ఒకక్షణం అదుపులోకి తెచ్చుకొని– "సరూ" అంటూ లోపలికివెళ్ళి ఓ పదహారేళ్ళ అమ్మాయితో తిరిగి వచ్చాడు మదన.

"మా చెల్లెలు సరళ."

"లోపలికి రా అక్కా."

అపరిచితమైనా, ఆప్యాయంగా వినిపించిన ఆ పిల్ల కంఠానికి ఒక్కక్షణం పులకింతకు లోనైంది రోహిణి. ఆ ఇంటివారి సంస్కారాన్ని ఊహిస్తూ కారుదిగి లోపలికి అడుగుపెట్టింది.

"రా, అమ్మా. కూర్చో.'' మదనతల్లి రోహిణి భుజంతట్టి, ఆ హాల్లోనే ఓపక్కగా

ఉన్న తివాసీమీదికి తీసుకుపోయింది.

"అమ్మ బాగుందా?"

"అమ్మ క్రితం సంవత్సరమే పోయిందండీ." విచారంగా చెప్పింది రోహిణి. "మీకు ఎలా తెలుసు మా అమ్మ?''

"అయ్యో! అమ్మ పోయిందా?" విచారంగా అంది మదనతల్లి. "మా ఊరు కంతే నమ్మాయ్! నా పెళ్ళి జరిగాక ఒక సంవత్సరమే అక్కడ ఉన్నాం. తరువాత అక్కడి ఆస్తిపాస్తులను అమ్ముకొని ఇక్కడ కంట్రాక్టు పనులు చూచుకొంటూ స్థిరపడి పోయాం... అమ్మ ఎలా పోయింది?"

"అనుకోకుండానే... గుండె ఆగి.." ఆ ప్రసంగం మార్చివేసి, తనచుట్టూవున్న యువతులను చూస్తూ "మీ అమ్మాయిలా?" అంది రోహిణి.

"ఇది సత్యభామ. మదన అక్క. బి. యిడి. అయి టీచరుగా ఉంటూంది. ఇది కస్తూరి. ఇది కావేరి. ఇది మణి. వీడు నా చిన్నకొడుకు. ఇంకా ఇద్దరు పిల్లలు బయటికి వెళ్లారు."

"ఓ! మీ ఇల్లు నిండుగా ఉంటుంది!"

''అయితే, నీ తరువాత మళ్లీ మీ అమ్మకు కాన్పు కాలేదన్నమాట!"

"ఉహూ. నేను పుట్టినప్పుడే అమ్మకు ఆపరేషన్ అయిందట. బలహీనంగా ఉందనికాన్పు బందుచేశారట. మళ్లీకాలేదు."

సరళ టిఫిన్‌ప్లేటు, నీళ్ళగ్లాసూ తెచ్చి రోహిణి ముందు ఉంచింది.

"నేను తీసుకొనేవచ్చానే. టీ మాత్రం ఇవ్వండి.''

"వీల్లేదు. తీసుకోవాలి.'' పిల్లల బలవంతంతో తీసుకోక తప్పలేదు.

ఎక్కువసేపు కూర్చోలేదు రోహిణి. ఏవో రెండుసంగతులు మాట్లాడి లేచింది.

"మరి, మీరువస్తే ఎక్కడ దిగుతారు? బంధువులున్నారా?" సత్యభామ అడిగింది, ఆమెను భోజనానికి పిలిచే అవకాశం ఉందేమోనని.



"ఎందుకూ? మా ఇల్లు ఉందిక్కడ. కాని, ఉండే అవసరం అంతగా కలగదు. పని చూచుకొని వెంటనే వెళ్ళిపోతాను. కాలేజీ తెరిస్తే హాస్టల్లో ఉంటాననుకోండి. నాన్న ఏ స్నేహితుల ఇంట్లోనో దిగుతుంటారు."

"మధ్యాహ్నంవరకే వెళ్ళిపోతారా?"

"లైబ్రరీలో పుస్తకాలు యిచ్చివేసి కొత్త పుస్తకాలుతీసుకోవడమే. తరువాత అరగంట ప్రయాణం మా ఊరికి.''

"ఎప్పుడైనా వస్తే ఇక్కడకు రావడం మరిచిపోకు అమ్మాయ్!"

సెలవుతీసుకొని వెడుతూ మదనకోసం చూచింది రోహిణి. తనను అప్పచెల్లెళ్ళ మధ్య వదిలి జాడలేకుండా ఎక్కడికో పోయాడు ఆ మానవుడు!

* * *

బయటినుండి వచ్చిన మదన ఇంటిముందాగిన కారు చూచాడు. "రావుగారు వచ్చినట్టుంది" అనుకొంటూ లోపలికి అడుగుపెట్టాడు. తండ్రితోమాట్లాడి వెళ్ళిపోతున్నారు రావుగారు. "అన్ని సంగతులూ నాన్నతో మాట్లాడానోయ్. నేనిక వస్తాను" అని కదిలి వెళ్ళి కారులో కూర్చొన్నారు.

స్నేహితుడిని సాగనంపి లోపలికివచ్చాడు మదన తండ్రి. ''సేవాసదనంలోనే నీకు ఉద్యోగం కల్పించడానికి రావు ఒప్పుకొన్నాడురా, ఒకమాదిరి జీతంతో. అయితే ఆయన పెట్టిన షరతు వేరే. తెలివైనవాడివి పొట్టకూటి జీతంలో ఇరికిపోవడం అతడికి కష్టంగా వుందట. నువ్వు మామూలుగా కాలేజీకి వెళ్ళి చదువుకొంటూనే వీలునుబట్టి ఉదయం ఓ రెండుగంటలు, సాయంత్రం

ఓ రెండుగంటలు – ఆయన చెప్పే బాధ్యతలను నిర్వహించాలట. నీ చదువుకు పెట్టే ఖర్చు నువ్వు సంపాదనాపరుడివయ్యాక తిరిగి ఇచ్చుకోవచ్చునట. కాకపోయినా స్నేహితుడి కొడుకును చదివించానన్న తృప్తి తనకు ఉంటుందని అన్నాడు!"

''ఏం? ఆయన పెట్టిన షరతును అంగీకరించకపోతే కేవలం ఉద్యోగం మాత్రమే యివ్వలేడా?"

"ఇందులో అభిమానపడడానికి ఏం లేదురా, మదన్! కేవలం నీ తెలివితేటలు, నీ కొచ్చిన క్లాసు చూచి ఉత్సాహపడుతున్నాడే గాని మన ఆర్థికపరిస్థితికి జాలిపడడం ఎంత మాత్రం కాదు. పోతే, అతడికి నీ మీద ఏవో ఆశలు కూడా ఉన్నట్టున్నాయి. ఈ సేవా సంస్థలు, ఇంకా ఇతరమైన పనులూ బాధ్యతతో, తెలివిగా నిర్వహించగల వ్యక్తికోసం అతడు అన్వేషిస్తున్నాడట. ఈమధ్య అతడి అనారోగ్యంవల్ల అన్నిపనులూ చూచుకోవడానికి ఓపికలేకుండా పోతున్నదని, సమర్థుడైన యువకుడికోసం చూస్తున్నానని అన్నాడు. బహుశా అతడి చూపులో నువ్వు పడ్డట్టున్నావు. నిన్ను చాలా మెచ్చుకొంటున్నాడప్పుడే! ఇందులో ఎవరి బలవంతంలేదు. ఆలోచించుకో నీ కిష్టమైతేనే చదువుకోవచ్చు."

*　　　*　　　*

''మదనమోహనరావుగారూ!''

''......'' సేవాసదనం ఆఫీసుగదిలో కూర్చొని ఏవో కాగితాలు పరిశీలిస్తున్నాడు మదన.

"మదన్‌బాబూ!" ఈసారి గట్టిగా పిలిచింది రోహిణి, అతడి బల్లకు దగ్గరగా కుర్చీ లాక్కొని కూర్చొంటూ. తను గదిలోకి వస్తూనే అతడు గమనిస్తాడేమో అనుకొంది రోహిణి. అలాంటిది పిలిచినా పలకని పనిలోని దీక్షకు వింతపడింది.

"ఓ!"

"నాన్నను డబ్బు అడిగారట కదా? ఆయనకు సుస్తీగా ఉండి నన్ను పంపించారు, చెక్కు ఇచ్చి."

"ఆc. ఇక్కడ కొన్ని మార్పులుచేసి కొత్త పద్ధతుల్లో సేవాసదనం నడపడానికి ప్లాను వేశాను. వాటి అమలుకు కొంత డబ్బు అవసరంపడి అడిగాను."

"ఆ కాగితాలు అవేనా? ఒకసారి ఇస్తారా? చూచి యిస్తాను...ఒక పరిశీలన మాత్రమే. పర్యవేక్షణ మాత్రంకాదు." అంది నవ్వుతూ.

కాగితాలు అందిస్తూ గంభీరంగా నవ్వాడు మదన. "ఎలా అయినా ఫర్వాలేదు. పనిలో బాధ్యత తెలిసినవాడికి ఇలాంటి కుశంకలకు, భయాలకు తావుండదు."

"ఒరేయ్, మోహనూ!"

ఇద్దరూ ఒకసారే తలెత్తి చూచారు. సహపాఠి, మదన ప్రియమైన స్నేహితుడూ అయిన రమణ వచ్చాడు గదిలోకి. వెనక ఓ యువతి.

"రా అమ్మా, కూర్చో." ఆమెను రమణే పిలిచాడు లోపలికి. పక్కనున్న బల్ల మీద కూర్చో చేశాడు.

ఇలాంటివాళ్ళు సదనానికి పరిచితులే. ఎవరో అనాధ అయివుంటుంది.

అనుకొన్నట్టుగానే రమణ చెప్పాడు.

రమణకు పొరుగున ఉండే కుటుంబం వాళ్ళది. పెళ్ళయి ఏడాది అయింది ఆమెకు. అత్తా, మగడి బాధలు పడలేక, దెబ్బలు తినలేక రాత్రి బావిలో దూకి ఆత్మహత్య చేసుకోబోయింది. ఎవరో చూచి వెంటనే బయటికి తీసి బ్రతికించారు. తమ పరువు బజారు కీడ్చిన ఆడదాన్ని తిరిగి ఇంట్లోకి రానివ్వమని వాళ్ళూ, ఆ రాక్షసుల కొంపలో అడుగు పెట్టలేనని యీమే భీష్మించుకోవడంతో ఓ పెద్దమనిషి రమణను తోడిచ్చి ఇక్కడికి పంపించాడామెను. ఆమెకు పుట్టింటివైపు వాళ్లకూడా ఎవరూ లేరట.

"నీ పేరేమిటమ్మా!" మదన అడిగాడు.

"సుజాత." బెరుకుగా చెప్పిందామె. చాలా చిన్నవయసు. పదహారు, పదిహేడేళ్ళలో ఉంటుందేమో! చామన చాయ, కళగల ముఖం. గాలి విసురుకు చెదిరిపోయిన పువ్వులా ఉందామె ముఖం. బెదిరిపోయినట్టుగా ఉంది మనిషి.

జాలిగా భుజం తట్టింది రోహిణి. "మరేం భయంలేదు, దిగులుపడకు. ఇది నీలాంటి వాళ్ళెందరికో చల్లని చోటు."

జలజలా కన్నీళ్లు కార్చేసింది సుజాత.

"ఏడవకు, లే. సదనాన్ని చూద్దువు. నీలాంటివాళ్ళను చూచి ధైర్యం తెచ్చుకో."

నిజంగానే ఆ అనాధ స్త్రీలమధ్యకు పోయి వాళ్ళను చూచాక కొద్దిగా కాంతి వచ్చింది సుజాత ముఖంలోకి. అక్కడ వుండేది చాలావరకు విధవలు. మొగుళ్లు వదిలేసిన వాళ్లు. వయసుమళ్ళి మగడూ పిల్లలూ ఎవరూ దిక్కులేక పొట్టగడవడం కష్టమైపోయినవాళ్ళు – ఎందరో.

ఎంత కష్టదశలో ఉన్నా – తమలాంటి వాళ్ళను చూస్తే మనిషి కెందుకో స్వాంతన, ధైర్యం.

*　　　*　　　*

చివరిసారిగా ప్రయత్నించి నిస్పృహగా వెనక్కి వాలింది రోహిణి, స్టీరింగ్ వదిలి. "లాభంలేదు. డ్రైవరుకు కబురు పెట్టాలి."

ఆ కారుకు పేరుకు మాత్రం ఉన్నాడు ఓ డ్రైవరు. అతడు ఉండేది ఇక్కడే. కాని, నెలలో పదిహేను రోజులు పనిలోకి రాడు. వాడికీ అయ్యగారివలెనే ఎప్పుడూ ఏదో అనారోగ్యం. చాలా సంవత్సరాలుగా అతడు తమదగ్గర వినయంగా పనిచేసుకుపోతున్నాడు గనుక అతడిని ఉద్యోగం నుండి తొలగిస్తే అతడి కుటుంబానికి మరో ఆధారమేమీ ఉండదని ఆ ఉద్యోగం కొత్తవాడికి ఇవ్వలేకపోతున్నారు రావుగారు.

పనికిమాలిన ఆ డ్రైవరుమీదా, అలాంటి వాడిని పనిలో ఉంచుకొని జీతం ఇస్తున్నందుకు తండ్రిమీదా విసుక్కొంటూ ఉంటుంది రోహిణి.

"త్వరలో ఈ ఆస్థి అజమాయిషీ నీకు అప్పగించేస్తా నమ్మాయ్! పాత పనివారికి ఎంతవరకు స్వస్తి చెబుతావో. ఎంతమంది కొత్తవారికి స్వాగతం యిస్తావో నీ ఇష్టం. కాని, నువ్వు ఎక్కువగా మార్పులు చేయ లేవు. నా మీద ఇప్పుడు విసుక్కొన్నంత సులభం కాదు. బాధ్యత నీదైనప్పుడు మానవత్వం అడ్డువస్తుంది," అని నవ్వేసేవాడు తండ్రి.

బాధ్యతలు, కర్తవ్యాలు స్వీకరించినప్పుడు మనిషి మామూలు ఆలోచనా పద్ధతికి స్వస్తి చెప్పవలసే వస్తుంది.

"డ్రైవరుకు కబురు పెట్టినా కారు బాగయ్యేప్పటికి చాలా రాత్రి అయిపోవచ్చు. కారు డ్రైవరుకు అప్పగించేసి ఇవాళ మా ఇంటికి రండి, అభ్యంతరం లేకపోతే." ఆహ్వానించాడు మదన.

"మీ ఇంటికి రావడానికి అభ్యంతరం లేదుగాని, ఈరోజు నేను వెళ్ళితీరాలి. నాన్న చాలా అస్వస్థతగా ఉన్నారు." ఆందోళన వ్యక్తం చేసింది రోహిణి. "డ్రైవరు **ఇంటికి మనిషిని పంపండి.**"


"లాభంలేదు." పెదవి విరిచాడు మదన. "ఈ రోజు వెళ్ళి తీరాలనే అనుకొంటే కారు మాట వదిలేసి స్టేషన్‌కు బయల్దేరండి. మరి టైంకూడాలేదు. రిక్షా పిలువనా?"

కంగారు పడింది రోహిణి. "అబ్బే! ఇక్కడ రైలెక్కి పక్క స్టేషనులో దిగడానికి నాకేం భయంలేదు గాని, అక్కడి నుండి నడిచి వెళ్ళాల్సి వస్తుందికదా? అసలే వర్షం వచ్చేట్టుందీ సాయంత్రం."

"సుకుమారమా?"

"సుకుమారంకాదు, బాబూ. రెండుమైళ్ళు సరదాగా నడిచిపోగలను. ఒక్కదాన్నీ, ఆ పొలాల గట్లమ్మటపడి... దేవుడు తమాషా చూడాలని వర్షాన్నికూడా తోడుచేస్తే... ఇహ నా పని..." భయంగా గుండెలమీద చేతులు వేసుకొంది.

"నేనూ వస్తా పదండి. మీ నాన్నగారిని చూడాలి. కొంచెం మాట్లాడే పనికూడా




ఉంది." ఆఫీసు గదికి తాళం వేయడానికి వెళ్ళాడు మదన.

కారులోంచి దిగింది రోహిణి. వరండాలో నిలబడి అవరణలో చెట్ల క్రింద నిలబడ్డ రోహిణిని చూస్తున్నారు ఆశ్రయం పొందిన అనాధస్త్రీలు. సుజాతకూడా ఇటే చూస్తోంది. మెట్లుఎక్కి వెళ్ళి సుజాత వీపు చరిచింది రోహిణి. "నువ్వేం బెంగపెట్టుకోకు. ధైర్యంగా ఉండు చూడు పార్వతమ్మా. బాగా బెదిరిపోయినట్టుం దీమె. కొంచెం ధైర్యం చెప్పు."

"పదండి." మదన వచ్చాడు.

గంభీరంగా ఎత్తుగా ఉన్న మదన విగ్రహం పక్కగా మేఘ మాలికల మధ్య మెరుపు తీగలా గంతులు వేస్తూ మెట్లు దిగి వెళుతూన్న రోహిణి వెనుక చిత్రమైన చూపుల తూపులు. ఐశ్వర్యాడంబరాలకు, అపూర్వమైన ఆనందాలకు నోచుకోని జన్మలు వాళ్ళవి. తమ అన్నదాత పుత్రిక అని కృతజ్ఞతతో పులకించే హృదయాలు కొన్ని అయితే, ఐశ్వర్యవంతుని అనురాగాల పట్టి అనిఈర్ష్యాసూయలతో ముకుళించుకుపోయిన నేత్రాలు ఎన్నో.

వీరి చూపులు రోహిణికి పరిచితమే. గమనించనట్టుగా సౌమ్యంగా నడుచుకొంటుంది వాళ్ళ మధ్యకు వచ్చినప్పుడు.

* * *

రోహిణితో స్టేషన్ ఇవతలికి వచ్చేసి కొన్ని క్షణాలు నింగికేసి చూపులు సారించాడు మదన. క్రమంగా మేఘావృత మౌతూంది ఆకాశం. ఎప్పుడో, ఏ క్షణంలోనో వచ్చేట్టుంది వర్షం.

"బయల్దేరుదామా? దోవలో తడిసిపోవచ్చు."

"కానీయండి. మొలకెత్తిపోముగా?"

"ఊఁ. నడవండి. మీ పిక్కబలం చూస్తాను."

"బాబోయ్! నావల్లకాదు. ఏదో షికారులా, నెమ్మదిగా పొలాల మధ్య నడకే కదాని సరదా పడుతున్నాను గాని పిక్కబలం చూపుకోడానికి నాకు నడక అలవాటులేదు."

వరుణ దేవుని తోడుచేసుకొని శ్రావణ సుందరి చేసిన సవరింపులతో సోయగాలు విరిసిన అడవి మధ్య ఇద్దరూ నడక సాగించారు నెమ్మదిగా.

మొన్న ఎడతెరిపి లేకుండా వారం రోజులు ఉధృతంగా కురిసిన వర్షాలకు నేల జాలుపట్టింది. మధ్యమధ్య జాలుపట్టి సన్నగా జడలల్లుకొని పారుతూన్న చిన్న కాలువలు, అవి తేల్చిన ఇసుక తిప్పలు. చెరువులో నీరు చూచి సాగుబడి మొదలు పెట్టిన వరిమళ్ళు. చుట్టూ దూరదూరంగా ఏపుగా పెరిగి కంకి ఈనడానికి తయారైన జొన్నపైరు. కన్నుల కింపైన పచ్చని ప్రకృతి.

"ఆలపించనా అనురాగముతో
అవనీ గగనం ఆలకించగా...'' సన్నగా కూనిరాగం తీస్తూ మదనవంక చూపులు పోనిచ్చింది రోహిణి. ఏమిటో పరధ్యానంగా నడక సాగిస్తున్నాడు అతడు. తడి తడిగా ఉన్న నేలమీద జాగ్రత్తగా అడుగులు వేస్తూ. "ఇంత చక్కని ప్రకృతి మధ్య మీకు ఆలోచించడానికి ఏం దొరికింది?"

"మనిషిని ఆలోచనలు కొరికి వేస్తుంటే ఏ కమనీయ ప్రకృతీ పలుకరించలేదు."

రోహిణిలో చలాకీతనం తగ్గింది. సానుభూతిగా అడిగింది. "ఇంట్లో ఇబ్బందులా?"

"అవే.'' దీర్ఘంగా నిట్టూర్పు విడిచాడు. "నా పుట్టుకతో మా నాన్నకు ఉన్న ఐశ్వర్యం అలా నిలిచి ఉంటే నేనో సౌందర్యారాధకుడిగా,భావుకుడిగా, కళాకారుడిగా మారి ఉండే వాడినేమో. ఏ కంట్రాక్ట్ పనులవల్ల సిరిసంపదలు పెంచాడో వాటివల్లే నష్టపడ్డాడు. అందుకే ఊహలతో ఎత్తుకు ఎగరలేక యథార్థవాదిగా పోవలసివచ్చింది. పెళ్లీడు దాటిపోతూంటే విరాగిణిగా మారిపోతూంది అక్క సత్యభామ. టీచరుగా ఉద్యోగం చేస్తూ సంపాదనాపరురాలైనా ఆ వయసుకోరే తృప్తి వేరే. అందుకు అవకాశం కల్పించలేక పోతున్నందుకు ఆమెకంటే ఎక్కువగా వ్యధ పడుతున్నది ఇంటికి పెద్దవాడినైనందుకు నేను, అమ్మా, నాన్న. ఇంకా పెళ్ళికి ఎదిగి వచ్చిన ఇద్దరు చెల్లెళ్ళు. చదివే పిల్లలు. వయసు వస్తూన్నందుకేమో ఇదివరకులా నిశ్చలంగా ఉండలేక పోతున్నాను. ఇంటి సమస్యలు ముందుకువస్తే తీవ్రంగా వికలమై పోతుంది మనసు.''

అతడి వేదనా హృదయానికి చేరువై ఊరడింపుగా ఏదో చెప్పాలని తపన చెందింది కాని, అంత చనువింకా ఇద్దరి మధ్యా ఏర్పడలేదు. ఏదో రెండు మాటలు పొడిగా చెప్పాల్సిందే. మనసు మరుగుపరుచుకొని శుష్కప్రియాలు చెప్పడం ఎలా? మూగగా తన కన్నులతోనే సానుభూతి వ్యక్తం చేసింది రోహిణి.

కారుమేఘాలు క్రమ్ముకువచ్చి టపటప చినుకులు రాలసాగాయి. చెట్టుమానుచాటుకు వెళ్ళి నిల్చున్నారు ఇద్దరు. అయినా గాలి విసురు అధికమై తడిసిపోక తప్పలేదు.

"ఇంటికి వెళ్ళగలమా లేదా?" భయపడిపోయింది రోహిణి.

వర్షంలోకే చూస్తున్న మదన అనుకొన్నాడు. 'అసలీరోజు ఈమెను బయల్దేరనీకుండా చేయవలసినమాట. వర్షంలో తడిసి ఈ సుకుమారికి జ్వరంగాని పట్టుకోదుగదా?'

వాళ్ళిద్దరూ భయపడినవిధంగా వర్షం నిలువలేదు. గాలి తరుముకుపోయింది ముందుకు. తిరిగి నడకసాగించారు. గాలికి తడిసిన దుస్తులు తడిపొడిగా ఆరాయి.

ఊరిబయటే రోహిణి నౌకరు ఎదురయ్యాడు, తోటదగ్గరికి కావలివెడుతూ.

''గంటముందు అయ్యగారు ఎంత బెదరగొట్టేసినా రమ్మగారూ! సోఫాల ఏదో సదువుకొంటు కూచొన్నాయన గుండె అరచేత బట్టుకొని పావుగంటదనుక అట్టే మాట్టాడకుండా ఉండిపోయేరు! నిలువునా చల్లజెమటలు! ఆచారిగారిని పిలుచుకువచ్చి చూపితే ఆయనేదో మందేసినాడు. చా తాగినాక కొంచెం తేరుకొన్నారు!"

కంగారుగానే ఇల్లు చేరింది రోహిణి. "ఎలాఉంది నాన్నా ఇప్పుడు?" సోఫాలో తండ్రిపక్కనే కూలబడిపోయి చేయి తడుముతూ అడిగింది.

''ఏం లేదమ్మా. పైత్యం ప్రకోపించిందన్నాడు ఆచారి. తేనెతో మందు యిచ్చాడు. తగ్గిపోయింది...కారేమైందమ్మా?"

మదన చెప్పాడు.

తండ్రికి కులాసాగానే ఉందని మరోసారి అనిపించుకొని లోపలికి వెళ్ళిపోయింది రోహిణి, చీర మార్చుకోడానికి.

"ఏమిటయ్యా విశేషాలు?"

సేవాసదనం సంగతులే కొన్ని చెప్పాడు మదన.

"నీ ఊహలు ఉన్నతమైనవే బాబూ! సదనాన్ని మంచి అధునాతన పద్ధతులతో అభివృద్ధి చేయాలంటావు. ఇంకా ఎక్కువమంది అనాధలకు వసతి కల్పించాలంటావు. దానికి నేనిప్పుడు ఏర్పాటుచేసిన డబ్బు చాలదు. నేను వ్యాపారంలో ధనవంతుడినయ్యాను. వ్యాపారమంటేనే అక్రమ ఆర్జన. ఆ పాప పరిహారంగా కొంత డబ్బు ఈ విధంగా సక్రమ వినియోగం కావాలని కొద్దిమందికోసం ఈ సేవాసదనాన్ని స్థాపించాను. సదనంలో చేరిన అనాధలకు కొన్ని వృత్తులు కల్పించి వాటివల్ల వచ్చిన డబ్బు మరికొంత మంది అనాధలకోసం ఉపయోగపడేలా చేయాలన్న నీ ఉద్దేశ్యం అనుకొన్న విధంగా సక్రమ ఫలితాన్ని ఇస్తూపోతే మంచిదే. అనుకొన్నట్టుగా కాకపోతే?"

''విరాళాలు ప్రోగుచేయాలి."

"అదీ అనుకొన్నంత సులభంకాదు."

"చేసి చూద్దామని ఉంది. అనుకొన్నట్టుగా కాకపోతే ఆ తరువాత విరమించుకోవచ్చు."

"ఇలా వృత్తులు కల్పించి వారితో పని చేయించడమంటే అదో పరిశ్రమ అవుతుందేగాని సేవాసదనం ఎలా అనిపించుకొంటుంది?" అని నవ్వారు. ''ఏమో, ఇహ నేనివన్నీ వదులుకోవాలనుకొంటున్నాను. అన్నీ అమ్మాయికి అప్పగించేసి, కేవలం ఒక సలహాదారుగా ఉండాలనుకొంటున్నాను. అదీ అమ్మాయి అవసరమనుకొంటేనే. నాకేమిటో ఈ అస్వస్థతమూలంగా మతిమరుపు, ఓపలేనితనం మొదలయ్యాయి."

"మీరిలా అస్వస్థత అని ఊరికే ఉండిపోవడం బాగోలేదండి. మీరు తగిన చికిత్స చేయించుకోవాలి. అక్కడికి వచ్చేసి మా ఇంట్లో కొన్నాళ్ళపాటు ఉండండి. మా చెల్లెళ్ళూ, తమ్ముళ్ళూ మీకేలోటూ లేకుండా చూస్తారు. మా ఫామిలీ డాక్టరు చాలా మంచివారు. తెలిసినవారు. అంటే మీకు అక్కడ ఉండడానికి వేరే ఇల్లు, వసతి లేదనికాదు. కాస్త నలుగురిలో మా ఇంట్లోఉండే పిల్లలలాంటి వాళ్ళమధ్య ఉంటే మీరు త్వరగా కోలుకొంటారు."

మదన కంఠంలో వినిపించిన ఆత్మీయతకు రావుగారి మనసు పులకించింది. కులాసాగా నవ్వేశారు. "నిజంగా ఆ అవసరం వచ్చినప్పుడు నీ ఆహ్వానం మనస్ఫూర్తిగా మన్నిస్తానోయ్! కాని ఇప్పుడప్పుడే ఆ అవసరం లేదు. ఇది వృద్ధాప్యానికి సహజమైన అనారోగ్యమే. దీనికి విశ్రాంతిగా, పల్లెపట్టులోని ఈ ప్రశాంత వాతావరణం చాలు."

రోహిణి వస్తూనే కోప్పడింది. "మీరు కాస్సేపు పడుకోండి నాన్నా! ముందే మీరు తలనొప్పితో బాధపడుతూ ఒళ్ళునొప్పులతో బాధపడుతూ వీపులు తీసేలా కూర్చొని ఏం మాటలు? వెళ్ళి పడుకోండి, విశ్రాంతిగా."

"వెడతానమ్మా." వెళ్ళడానికి తయారై "ఈ రోగాలకు చిత్రమైన, విరుద్ధమైన రెండు గుణాలు వున్నాయి. పొద్దున ఎవరితో మాట్లాడాలన్నా విసుగ్గా, తలనొప్పిగా అనిపించింది. ఒంటరిగా గదిలో వుండిపోయాను. ఇహ పొద్దు తిరుగుతూంటే ఉండలేకపోయాను. కాస్త నలుగురిలో మాట్లాడితేగాని బాధ మరిచినట్లు అయి ఉత్సాహం రాదని గదిలోంచి లేచి వచ్చాను." అన్నారు రావుగారు.

రోహిణితో ఇదివరకు అంటీఅంటనట్టు మాట్లాడే మదన ఇకనుండి ఏ విషయం సంప్రదించినా ఆమెతోనేనని తెలిసి తన సంకోచం కొద్దిగా వదిలించుకోక తప్పలేదు. రాత్రి చాలా సేపటివరకు సేవాసదనం సంగతులే మాట్లాడాడు. అన్నివిధాలా అతడి అభిప్రాయంతో ఏకీభవించిన రోహిణి అతడి ఆలోచనలు ఆచరణలో పెట్టడానికి అవసరమైన డబ్బు ఇవ్వడానికి అంగీకరించింది.

ఉదయం డ్రైవరు తీసుకువచ్చిన కారులోనే తిరిగి వచ్చాడు మదన.

* * *

"తోట బాగా వచ్చింది."

పగలంతా ఎండకు కాలిన నేల అప్పుడప్పుడే తగిలిన నీటితడికి కమ్మని వాసనలు వెళ్ళగ్రక్కుతూంది. పచ్చగా పూసిన బీర




పూలమీద ఏవో రెక్కలపురుగులు ఝుమ్మని వాలుతున్నాయి.

తోటలో అన్నిపాదులూ ఆరోగ్యంగా గుబురుగా పెరిగాయి. పొట్లపందిరినిండా నేలను తాకేలా క్రిందికి వేళాడుతున్నాయి పొట్లకాయలు. అన్నిపాదులూ నిండా పూతలతో, పిందెలతో కలకలలాడుతున్నాయి. నీళ్ళుపోస్తూన్న పార్వతి మోము రోహిణి మెచ్చుకోలుకు తృప్తిగా వెలిగిపోయింది. ఈ సేవాసదనమే తనకు ఆశ్రయం ఇవ్వకపోతే - మగడు చనిపోయి, వెనకాముందు ఎవరూ ఆదుకోనేవారులేక, జీవిక కల్పించుకోడానికి మరో ఆధారంలేక ఏమైపోయేదో తను? రోహిణిఅన్నా, రోహిణి తండ్రిఅన్నా కృతజ్ఞతతో వెలిగిపోతుంది పార్వతి మోము.

మదన పథకంప్రకారం అక్కడి స్త్రీలు సోమరిగా కూర్చొని బాధలు పెంచుకోకుండా తగినంత పరిశ్రమ కల్పించబడింది. దానివల్ల తమ గాధలను బాధలను గుర్తుతెచ్చుకొనే తీరికే లేకుండాపోయింది చాలామందికి. ఎవరికి మనసైన పని వారికి కల్పించబడింది. కొందరికితోటపని, కొందరికికోళ్ళపెంపకం, కొందరికి పాడిపరిశ్రమ, కొందరికి కుట్లూ అల్లికలు. ఇలా ఎన్నోరకాల వృత్తులు. వీటివల్ల ఆదాయం కూడా పెరిగి మరికొంతమంది అనాధలకు ఆశ్రయం కల్పించబడింది.

మదన ఊహలు నూటికినూరుపాళ్ళు యథార్థరూపం ధరించడమేకాక సేవాసదనం పేరు ప్రతిష్ఠలు ఇనుమడించాయి. సదనం కార్యక్రమాలను ప్రశంసిస్తూ వ్యాసాలు వచ్చాయి పత్రికలో.

ఈ కీర్తి పూర్తిగా దక్కవలసింది మదన ఒక్కడికే కాదు. రోహిణి సహకారం ఎంతో ఉంది. అతడి కార్యక్రమాలపట్ల కలిగిన ఆసక్తి, అభిమానం ఆమెను కూడా సేవారంగంలోకి దిగేలా ఉత్సాహపరిచాయి. చదువుకు ఎప్పుడో స్వస్తివాచకం పలికింది.

సదనంలో అన్నీ పరిశీలనగా గమనిస్తూ వస్తూంది రోహిణి. అటు పెరటివైపు పూలతోటలో కనిపించిన దృశ్యం కించిత్తు ఆశ్చర్యాన్నీ, అనుమానాన్నీ రేకెత్తించింది. బిందె చంకలో ఇరికించుకొని చూపులు అవనతంచేసి విషాదం మూర్తీభవించినట్టుగా నిలుచుంది సుజాత. మదనసమీపంగా - చాలా సమీపంగా ఆమె ముఖంలో ముఖంపెట్టి ఏదో చెబుతున్నాడు.

వారిని సమీపించి పేలవమైన నవ్వుతో "ఏమిటి?" అంది రోహిణి.

"ఈమెకు ఎలా చెప్పాలో బోధపడటం లేదు, రోహిణీ! తను వీళ్ళలో కలిసి ఉండలేకపోతున్నదట. ఎక్కడికైనా వెళ్ళిపోతుందట. ఏడుస్తూంది."

"ఎందుకమ్మా?ఏమైందిక్కడ?" సుజాత భుజం తట్టింది రోహిణి అనునయంగా.

ముఖం త్రిప్పేసుకొని ఏడవ సాగింది సుజాత.

మదనే చెప్పాడు. "వీళ్ళమాటలు, చూపులు తనకు దుర్భరంగా ఉన్నాయంటూంది. మగడిని వదిలేసివచ్చిన ఆడది అని, తన గుణం మంచిదైతే అత్తా, మగడు ఎందుకు తంతారని – ఏవో గుసగుసలాడుతున్నారట." అతడి మాటల్లో చాలా సానుభూతి వ్యక్తమౌతూంది.

'నువ్వు అవేమీ పట్టించుకోకూడదమ్మా. వీళ్ళంతా నీ అప్పచెల్లెళ్ళనుకోవాలి. నిన్ను చెడ్డగా అనుకొన్నా నువ్వు చూచీ చూడనట్టు పోవాలి. ఒక కుటుంబంలోనే, ఒక కడుపున పుట్టిన నలుగురిలోనే ఎన్నో మాటలు, కలతలు వస్తాయి. మరీమన ఆడజాతిలో. అలా అని ఇల్లువదిలేసి బయటికి వెళ్ళిపోగలమా? నువ్వు బేలగా ఏడవకూడదు. ధైర్యంగా ఉండు. ఎవరన్నా ఏదన్నా అది వారి అజ్ఞానంగా ఎంచి నువ్వు నవ్వుతూ వెళ్ళిపోవడం నేర్చుకోవాలి. అలాగేనా?" వీపుతట్టి హుందాగా కదిలి వెళ్ళిపోయింది రోహిణి.

ఆఫీసుగదిలో ఏవో కాగితాలు తిరగేస్తూ కూర్చొన్నా మనసు స్థిరత్వాన్ని కోల్పోయి కలతపడసాగింది. అది, సుజాతకడ మదన మెలిగిన తీరు! ఎందుకో అంత ఆత్మీయత అతడు ఆమెమీద చూపడం అసందర్భమనిపించింది.

అంతగా ఒక ఆడదానిమీద, మగడికి దూరమైన పడుచు అమ్మాయిమీద–జాలిపడే మనిషి దృఢ చిత్తుడు కాకపోవచ్చునేమో. అలాంటివాడు ఈ సేవాసదనంలో పనికిరాడేమో!

రోహిణి ఆలోచన అంతవరకే ఆగితే మరి బాధకు లోనుకావలసిన అవసరంలేదు. కాని, మరేదో ఆమె మనసులో కలవరం చుట్టుముట్టిన మధురోహలు.

ఇన్నాళ్ళ తమ సన్నిహితత్వంలో మనసులు విప్పి మాటలతో మరులు సంగతి చెప్పుకోకపోయినా కన్నులు కన్నులు కలిసి ఏవో ప్రణయభాషలే మాట్లాడుకొన్నాయి.

అప్పుడప్పుడూ అతడి కన్నుల్లో కదిలాడే వింతకాంతి – తను ఊహలతో భ్రమ పడిందా? ఊహూ. అతడికి తనంటే ఆకర్షణవుంది. ప్రేమ? ఏమో! ఆ ఆకర్షణే ప్రేమ అని భ్రమ పడిందేమో? అయితే తను చాలా పరిహాసాస్పదమైన పరిస్థితిలో చిక్కుకుందన్న మాట. అతడి సాహచర్యం సుస్థిరం చేసుకోడానికేకాదూ, తను యీ సేవాసదనం బరువుబాధ్యతలు స్వీకరించింది? కాకపోతే తను చదువును అలక్ష్యం చేయవలసిన పనేమిటి? తన చదువు పూర్తి అయ్యేదాక నాన్ననే చూచుకొమ్మని చెప్పేది.

అయితే, తన ప్రోత్సాహం అతడికి ఉత్సాహకరంగానే కనిపించింది.

మరి ఏమిటి తను చూచిన దృశ్యంలో అంతరార్థం?

*　　　　*　　　　*

చిన్న తమ్ముడి పుట్టినరోజని సత్యభామ ఆహ్వానం గుర్తుచేసుకొని, షాపుకు వెళ్ళి కొత్తచొక్కా, లాగు మరి రెండుమూడు ఆటవస్తువులు తీసుకొని బయల్దేరింది రోహిణి. మధ్యాహ్నంవరకే భోజనానికి రమ్మని మరీమరీ చెప్పింది సత్యభామ. ఆఫీసు పని తెమలక సాయంత్రం బయల్దేరింది రోహిణి.

ఎందుకో ఈ మధ్య సదనంలో కాలు పెట్టడంలేదు మదన. కాలేజీకికూడా సక్రమంగా వెళ్ళడం లేదని తెలియవచ్చింది. ఇంటికి వెడితే ఏమిటో తెలియగలదన్న ఆశకూడా ఉంది రోహిణికి.

పుట్టినరోజు పండుగ ఏర్పాట్లు గొప్పగానే చేశారు.

ప్రస్తుతం అనుభవిస్తున్నది లేమి ఐనా ఆడంబరాలకు, అట్టహాసాలకు తక్కువ లేదు. శ్రీమంతం అనుభవించిననాటి అలవాట్లను మరిచిపోలేక ఉన్ననాడు ఉగాది, లేనినాడు శివరాత్రిలాగ గడిపే జీవితానికి అలవాటుపడిం దా కుటుంబం.

ఆడపిల్లల పెళ్ళిళ్ళకూ, మగపిల్లల చదువులకూ ఇబ్బంది పడిపోయే ఆ కుటుంబం చిన్నబ్బాయి పుట్టినరోజని ఇంతపెద్ద ఏర్పాట్లు చేయడం ఆశ్చర్యం గొలిపింది రోహిణికి. ఆమె వెళ్ళేప్పటికి భోజనాలు ముగిసి, పేరంటం జరుగుతూంది. చాలా వరకు గొప్పింటివాళ్ళే వచ్చారు.

బాబుకు తను తెచ్చిన వస్తువులు అందించి పేరంటాళ్ళమధ్య కబుర్లాడుతూ కూర్చొన్న సత్యభామ సరసన కూర్చొంది రోహిణి. మాయ, మిగతా ఇద్దరాడపిల్లలూ పసుపు కుంకుమ లందిస్తున్నారు పేరంటాళ్ళకు.

ఎవరో మొహమాటం తెలియని ముత్తయిదు, "ఇంకా ఎన్నాళ్ళిలా సత్యతో ఉద్యోగం చేయిస్తారమ్మా? పెళ్ళిచేసుకొని ముచ్చటగా సంసారం చేసుకొనే వయసంతా గడిచిపోతూంది," అంటూంటే, పేరంటాళ్ళకు తాంబూలం, పళ్లు అందిస్తూ సరదాగా కబుర్లు చెబుతూన్న మదనతల్లి ముఖం మాడిపోయింది.

"దాని సంపాదనకు ఆశపడి ఉద్యోగం చేయిస్తున్నామా, వదినా? మనకు తగిన సంబంధం దొరకకనే కదా ఇలా ఉండిపోవలసివచ్చింది? నాకు గుండెలమీద కుంపటిలా లేదనుకొన్నావా, వదినా? ఈ ఆడపిల్లల పెళ్ళిళ్ళ బెంగతో తిన్నదంతా నీరైపోతూంది."

"ఆఁ. అది ఉద్యోగం చేయబట్టి ఏ ఏడెనిమిది సంవత్సరాలో అవుతుందా? ఆ డబ్బు అంతా బాంకిలో జమకడ్తూ వస్తే ఆ డబ్బుతో ఏ విదేశాలకు వెళ్ళివచ్చిన డాక్టరునో, ఇంజనీరునో సంపాదించుకొనేది కాదూ?"

సిగ్గుతో క్రుంగిపోయింది మదనతల్లి. కడుపులో చల్లకదలని అమ్మలు మాట్లాడే మాటలు ఇవి. లోతునబడిన సంసారాల ఇక్కట్లు ఇలాంటి గొప్పవారికి ఎలా తెలుస్తాయి?

విసుగ్గా, అసహనంగా లేచింది సత్యభామ. "రండి. పైకివెడదాం."

సత్యభామ వెనుక పేరంటాళ్ళ మధ్య నుండి దారి చేసుకొంటూ బయటపడేప్పటికే మరో మూలనుండి వినవచ్చింది.

"మదన ఎంత బుద్ధిమంతుడు? ఇలా ఎలా మారిపోయాడో? ఎవరో చెబితే నేను నమ్మేదాన్ని కాదనుకో. ఇంటికి ఎదురుగా... పొద్దున లేస్తూ కళ్ళముందు ... అదెవతో మగణ్ణీ, ఇంటినీ వదిలేసి వచ్చిందట, సేవా సదనంలోంచి బయటికి తీసుకువచ్చి అక్కడ కాపురంపెట్టాడు. ఇంటికి వస్తుంటాడా, లేదా?"

మదన చెల్లెలు మాయ కోపంగా అరిచింది. "ఇంతమందిలో నీ కంచుగంట గొంతుతో చాటకపోతే నీ కడుపుబ్బరం తీరదా, ఏమిటత్తా? మా అవమానం నీకంత సంబరంగా ఉంటుందేమిటి?"

తరువాత ఏంజరిగిందో వినకుండా నే మేడ మీదికి వచ్చేసింది సత్యభామతో రోహిణి.

డాబామీద పరిచివుంచిన తివాసీమీద మౌనంగా ఎవరి ఆలోచనల్లో వారు మునిగిపోయి కూర్చున్నారు రోహిణి, సత్యభామ.

మదన ఇంత నికృష్టమైన పని చేస్తాడని నమ్మలేకపోతూంది రోహిణి. సేవాసదనంలోంచి ఎనిమిది పదిరోజుల క్రిందే సుజాత వెళ్ళిపోయింది నిజమే. అప్పటినుండి మదన ఆఫీసుకు రావడంకూడా తగ్గింది. నాలుగైదు రోజులుగా బొత్తిగా రావడమేలేదు. కారణం ఇదని తెలిసి విస్మయానికి తోడు వ్యధకూడా కలిగింది రోహిణికి. తండ్రి అస్వస్థత కారణంగా – తను కష్టపడి సంపాదించిన లక్షల ఆస్తినీ, అల్లారుముద్దుగా పెంచుకొన్న ఏకైక పుత్రికనూ అపురూపంగా, బాధ్యత తెలిసి మసలుకొనే వివేకవంతుడైన వ్యక్తి చేతిలో పెట్టిపోవాలని తాపత్రయపడుతున్నాడు. తనకు యోగ్యుడైన వరునిగా మదనను ఎన్నుకొన్నట్టుగా ఉంది తండ్రి. కాకపోతే అతడి తెలివితేటలు, గుణగణాలు మెచ్చుకొని "మదన బుద్ధిమంతుడు కదూ, అమ్మాయీ?" అని ఎందుకు అడుగుతాడు?



తన సంగతి చెప్పేదేముంది? మదన సుందరుడు. గంభీరుడు. సేవా భావాలతో నిండిన సంస్కార హృదయుడు. తను చదువు మానేసి అతడితో గడిపిన ఈ ఆరు నెలల సాహచర్యంలో ప్రతి విషయంలో తన మనసు చూరగొన్నాడు. ఇప్పుడింతగా దగా పడవలసి వస్తుందని కలలోకూడా అనుకోలేదు.

"దౌర్భాగ్యవశంతో లోతున బడిన సంసారమైనా ఆణిముత్యాల్లాంటి పిల్లలని గర్వపడే అమ్మా, నాన్నకు పెద్ద ఆఘాతం. వాడి ఆదర్శాలన్నీ ఏ ఏట్లో కలిపాడో, ఒక ఆడదాని ప్రలోభంలోపడి నిండుకుటుంబంలో ఎలా చిచ్చు రగిల్చ గలిగాడో బోధపడడం లేదు రోహిణీ! నాన్న చెబితే నమ్మలేకపోయాం."

'నమ్మలేను.' రోహిణికూడా అనుకొంది. 'ఏమో! వయసులో చేటు ప్రమాదం ఉంటుందేమో. ఒక కడుపున పుట్టిన బిడ్డలే కాదూ అతడూ, సత్యభామా? ఈవిడ నిగ్రహంలో శతాంశం ఉన్నా గతిలేని ఒక ఆడ

దాని కోసం నిప్పులాంటి వంశానికి ఇంత అప్రతిష్ఠ అంటగడతాడా ?

సత్యభామ: సుందరంగా కవరు తొడిగిన ఓ విషాదకావ్యం. యవ్వన సహజమైన కోరికలు, ఆశలు ఉన్నాయి. కాని, అన్నీ అణచుకొని పైకి చాలా నిగ్రహంతో ప్రవర్తించగలదు. అసంతృప్తిలేని మనిషిలేడు. కాని అది అంతరంగంలోనే అదుముకొని ప్రవర్తించడంలోనే ఉంది మనిషికి అందం, హుందా.

"అదెవతో నెరజాణ. మదన లొంగిపోవడం మామూలు విషయంకాదు."

"చాలా పొరపాటు. చాలా అమాయకంగా ఉంటుంది ఆమె. వీళ్ళిద్దరికీ పొత్తు ఎలా కుదిరిందో, బిడియం లేకుండా ఎలా అతడితో కాపురం వెలగబెడుతూందో ఆశ్చర్యంగా ఉంది...అతడిని మీరేమీ అడగలేదా ? అసలు ఇంటికి వస్తున్నాడా ?"

"ఎప్పుడొచ్చేది, ఎప్పుడు వెళ్ళిపోయేది తెలియదు. వాడి ప్రవర్తనే అగమ్యంగా ఉంది. అమ్మే ఉండబట్టలేక అడిగింది. వాడు చెప్పిన సంగతి చాలా మామూలుది. ఆ పిల్ల సేవాసదనంలో ఉండలేక పోయిందట... అనాథగా ఓ శరణాలయంలో పడి ఉండడం ఆ పిల్లకు కష్టంగా ఉందట. ఆ పిల్ల ఏడుపు చూడలేక వేరే ఇల్లు తీసుకొని ఉంచి, ఆవిడ మగడితో పరిచయం చేసుకొని అతడిలో మార్పు తెచ్చి ఆలూమగల్ని ఒకటి చేసే ప్రయత్నంలో ఉన్నాడట."

"ఇది చాలా అమాయకమైన ఆలోచన. ఇంత అపఖ్యాతి సంపాదించాక ఆమెను మగడితో కలపడమన్నది ఎంత హాస్యాస్పదమైన సంగతి ? ఇదేదో కల్పించి చెబుతూన్న కథేగాని, ఇలా చేస్తున్నానని నాతో ఓమాట చెప్పకూడదా ? నా సహాయం తీసుకొంటే పని సులభంగా జరిగిపోయేదేమో!"

మదన తల్లి వచ్చింది. "భోజనం ఇక్కడికే పంపించనా అమ్మాయ్ ? హాయిగా వెన్నెట్లో ఇక్కడే కూర్చో."

రాత్రి మీరుతుందని రోహిణి మొహమాట పడినా, భోజనం చేయకుండా వెళ్ళనీ లేదు మదనతల్లి.

తాంబూలం తీసుకుని, అందరికీ చెప్పి వచ్చి కారులో కూర్చుంది రోహిణి.

మదన వచ్చాడు. చిరునవ్వుతో నమస్కారంచేసి, మౌనంగా ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

"పద."

కారు స్టార్టుచేశాడు డ్రైవరు.

* * *

"రండమ్మా. కూర్చోండి." కొత్తదనం మాయని జంకుభావా పలికింది సుజాత.

రోహిణి కూర్చోలేదు. హస్తభూషణంగా తీసుకుపోయిన వీక్లీ తిరగవేస్తూ కిటికీదగ్గరగా నిలబడింది. "అక్కడ నీకు కలిగిన ఇబ్బంది ఏమిటని బయటికి వచ్చావు, సుజాతా ?" సౌమ్యంగా అడుగుదామని ప్రయత్నించింది కాని ముఖం చిట్లించుకోకుండా ఉండలేకపోయింది.

"ఎందుకో నాకు బాగుండలే దక్కడ." ముక్తసరిగా జవాబిచ్చి ఊరుకొంది సుజాత.

"ఇక్కడ బాగుందా ?"

"బాగుండకేం ? స్వేచ్ఛగా ఉందిక్కడ. అక్కడంతా కుళ్ళుబోతుతనం, పనిలో పోటీ. చేయకపోతే తిట్లు, నాతోటి ఆడవాళ్ళతోటే! ఆ కూపంనుంచి బయటపడి స్వేచ్ఛగా గాలి పీల్చుకొంటున్నాను."

నిజంగా, స్వేచ్ఛగా ఎగిరిపోవడానికి రెక్కలు వచ్చిన పక్షిలానే ఉంది సుజాత. ఉత్సాహంగా, సంతోషంగా ఉంది. ముఖంలో కొత్త దీప్తి, కొత్త అందం వచ్చాయి. ఇదివరకటి దీనత్వం, అమాయకత మచ్చుకుకూడా కానరావడంలేదు. స్వేచ్ఛావాయువుల్లో మనిషి ఎంత తొందరగా, విచిత్రంగా ఎదిగిపోతాడు ?

"సేవాసదనంలో నీకు అసౌఖ్యమే కలిగి ఉండవచ్చు. ముఖ్యంగా, మన ఆడవాళ్లలో కుళ్లుతనం, ఓర్వలేనితనం, తోటి ఆడదాన్ని కించగా చూడడం సహజంగా ఉంటాయి. గృహసౌఖ్యాలకూ, ఆనందాలకూ దూరమై అసంతృప్తికి లోనైనవారి సంగతి వేరే చెప్పాలా ? సహనంగా నెట్టుకుపోవలసిన మాట."

"........."

సుజాత ముఖంలోని రోషం, బింకం చూస్తుంటే ఉడుకెత్తుకు వచ్చింది రోహిణికి. "సహనమంటే నీకు తెలీదనుకొంటాను. అది ఉంటే మగణ్ణి, ఇంటినీ వదులుకొని యిలా బయటికి వచ్చేసేదానివికాదు. నీ స్వేచ్ఛనూ, సుఖాన్నీ చూచుకొన్నావుగాని భవిష్యత్తులో పైకి పోవలసినవాడు, పేరు ప్రతిష్ఠలు తెచ్చుకోవలసినవాడు మదన మోహన్ పాడయ్యాడు. వారివంశాని కెంత అవమానం ?"

"ఇప్పుడేమంత అవమానకరమైన సంగతి జరిగిందని మీరిన్ని మాటలు మాట్లాడుతున్నారు ?" అందులో అర్థంకానితనంకంటే పెంకెతనమే ఎక్కువగా ఉంది.

"ఒక మగణ్ణి వదిలేసిన ఆడదానితో కాపురంపెట్టాడంటే అవమానంకదూ ?"

"మీరు చాలా అసహ్యంగా మాట్లాడుతున్నారు. ఆయన నాతో కాపురం పెట్టాడని ఎవరు చెప్పారమ్మా మీతో ? అక్కడ ఉండలేనంటే ఇక్కడ ఇల్లు తీసుకొని ఉంచారు. మావారి మనసు మారితేసరే, లేకపోతే నాకాళ్ళమీద నేను నిలబడేదాకా నా మంచీచెడ్డా కనుక్కొంటూ ఉంటానని అభయమిచ్చారు. అంతే. మాలో చెడ్డలేనంత వరకు లోకాన్ని చూచి భయమెందుకు ?"

"పిల్లి కళ్ళుమూసుకొని పాలుత్రాగడమంటే యిదే. నీ కల్లబొల్లికథలు ఎవరూ నమ్మరు."

దెబ్బతిన్న పులిలా చూచింది సుజాత. ముక్కుపుటాలు ఉబ్బేస్తూ గట్టిగా అరిచింది. "నమ్మకపోతే పొండి. మీరు నమ్మితే నాకేం? నమ్మకపోతే నాకేం ? మీకు సంజాయిషీ ఇచ్చుకోవలసిన అవసరం లేదు నాకు."

"అవసరం నీకులేదేమోగాని నాకుఉంది. పదిమందికి ఉపయోగపడవలసినవాడు నీ

ప్రలోభంలోపడి గ్రుడ్డివాడయ్యాడు. అతడిని రక్షించాలి."

"మీకేమిటి సంబంధం ?" ఎగతాళిగా నవ్వేస్తూ, గడుసుగా అడిగింది సుజాత. "మిమ్మల్ని ప్రేమించాడా ? పెళ్ళి చేసుకొంటానని మాటిచ్చాడా ?"

ఈ ఎదురుదెబ్బకు నిశ్చేష్టురాలైంది రోహిణి.

"అతడికోసం మీకెందుకింత తాపత్రయం ? ఆయన నన్ను ప్రేమించి పెళ్లాడితే సాటిలేని అదృష్టాన్ని నోచుకొన్న ఇల్లాలిగా పునర్జన్మ ఎత్తాననుకొంటాను. ఇందులో తప్పేముంది ? ఆదర్శవివాహం, ఆదర్శ దాంపత్యమౌతుంది మాది.''

అవమానంతో, ఎదురుదెబ్బతో గుండె మండిపోతుంటే చరాలున బయటికివచ్చేసింది రోహిణి. గుమ్మంలో ఎదురుపడ్డాడు మదన, చాలా గంభీరంగా. సుజాతవల్ల తనకు జరిగిన అవమానం అతడికి తెలిసిఉంటుందనుకొనేటప్పటికి తలెత్తుకో లేకపోయింది రోహిణి. కారులో కూలబడి, గుమ్మంలో నిలబడి చూస్తూన్న మదనతో అంది, పెదవులు అదురుతూంటే; "మీతో కొంచెం మాట్లాడాలి. వస్తారా ?"

"నాకు తెలుసు మీరు మాట్లాడేదేమిటో. మీదగ్గర నేను ఉద్యోగినైనంత మాత్రాన మీకు సంజాయిషీ ఇచ్చుకోవలసిన అవసరం లేదు." లాల్చీజేబులోంచి నోటుబుక్కు తీసుకొని అందులో ఏదోరాసి కాగితం పర్రున చించి రోహిణిచేతిలో ఉంచాడు మదన.

ఒళ్ళంతా రక్తం ఆవిరులెత్తింది రోహిణికి. కొద్దిక్షణాలు శిలలా అయిపోయింది, చేతిలో కాగితంచూస్తూ. ఇంత పుటుక్కున మదనతో సంబంధం తెంచుకోడానికి ఆమె తయారుగాలేదు.

బిగుసుకుపోయిన గొంతును ఎలాగో పెగల్చుకొని, "నేను తొందరపడ్డానేమో ? నన్ను కొంచెం ఆలోచించుకోనివ్వండి. నా తొందరపాటును ఒప్పుకొనేపక్షంలో మీ రాజీ



నామా తిరిగి పుచ్చుకొంటారా ?" అంది.

మదన మాట్లాడలేదు.

"దయచేసి మీరు రాజీనామా ఉపసంహరించుకోవాలి." ఆర్ద్రంగా చూచింది.

"అంత వరకూ అది మీదగ్గరే ఉంచుకోండి." ఇంట్లోకికూడా వెళ్ళలేదు మదన. చరచరా వీధిలోకే నడిచాడు.

* * *

"రోహిణీ !

తొందరపడ్డానని క్షమాపణ కోరుతావని నాకుతెలుసు. ఎందుకంటే ప్రేమ ఉన్నచోట బలవంతుడై ఉండికూడా కావాలని లొంగిపోవడం జరుగుతూంటుంది కనుక !

నీ మనస్సెంతగా ఘర్షణ పడుతున్నదో, ఆవేదనపడుతున్నదో నేనూహించగలను. అందుకే వ్రాస్తున్నా నీమాటలు.

స్త్రీ సహజంగానే నువ్వు సుజాతపట్ల ఈర్ష్యపడ్డావు కాని, అది పూర్తిగా అపార్థం. కేవలం ఉద్యోగధర్మంగానే సేవాసదనంలో పనిచేయడంలేదు నేను. మొదటినుండీ నాకు సేవారంగంలో అభిరుచి ఎక్కువ. ఆవిడకు సేవాసదనం బందిఖానాలా ఉన్నప్పుడు అక్కడినుండి ఆమెను తప్పించి ఆమెకు తృప్తిగా ఉన్నచోట ఉంచడమే సేవ చేయడమౌతుందనుకొంటాను.

ఏమీ లేకపోయినా, పైకి అమాయకంగా కనిపించినా కొందరిలో ఆశలకు, అహంభావానికి తక్కువవుండదు. అలాంటిది సుజాత. భర్తతో సుఖపడాల్సిన ఈ వయసులో ఒంటరిఅయి అనాథగా బ్రతకడం చిన్నతన మనిపించింది ఆమెకు !

అందుకే ఇల్లుతీసుకొని ఉంచాను సుజాతను. ఆమె భర్తతో మాట్లాడాను. అన్ని విషయాలుచెప్పాను. అతడిలో పరివర్తనకు పాటుపడ్డాను. తల్లి అంటే అతడికి బెదురుగా ఉన్నట్టుంది. సుజాతను ఇంటికి తీసుకుపోవడానికి అంగీకరించలేదు. అతడేవచ్చి సుజాతను పలకరించి వెళ్లాడు ఒకసారి. మరి కొన్నాళ్ళలో (పరిస్థితులు సానుకూలపరుచుకొని) సుజాతతో కాపురం చేయడానికి సమ్మతించాడు.

ఒకవేళ ప్రయత్నాలు విఫలమై సుజావా భర్త దారిలోకి రాకపోయినా, ఆమె మన సేతసదనంలో నేర్చుకొన్న కుట్టుమిషన్ మీద బ్రతికే ఏర్పాట్లుచేసి, నేను తప్పుకొనేవాడిని.

ఈ మాత్రానికే ఇంత సంకుచితమైపోయాయి లోకుల ఆలోచనలు ! ఎందుకంటే ఆమె యువతీ, నేను యువకుడిననే కదా ? సేవారంగంలో స్త్రీపురుష భేదాలకు స్థానం లేదనుకొంటాను. నా మనసు నిష్కల్మషం. సుజాతసంగతి నాకు తెలియదు. బహుశా నేనంటే మమత దాచుకొందేమో.

ఇన్ని సంగతులూ, ఉద్యోగధర్మంగా నేను ఇచ్చుకొనే సంజాయిషీకాదు. మనసులు విప్పుకొని, ఏనాడూ చెప్పుకోని మన మూగ అనుబంధానికి వివరణమాత్రమే.

నా ప్రేమ దోచుకొన్నది ఎవరో నా చూపులు నీకెప్పుడూ చెప్పలేదా రోహిణీ ? ఎందుకంత సంకుచితంగా అపార్థం చేసుకొన్నావు ? అనవసరంగా నిన్ను నీవు బాధించుకొని నన్ను బాధపెట్టావు సుమీ !

'మదనను అల్లుడిని చేసుకొంటానోయ్!' మా నాన్నతో అన్నారట మీనాన్న. కోటీశ్వరుడి అల్లుడినైతే నా సమస్యలు చిటికెలో విడిపోతాయి. కాని, సోమరిగా కష్టాలకు దూరంగా పారిపోవడంకంటే, ధైర్యంగా ఎదుర్కొనడంలోనే నిజమైన తృప్తి లభిస్తుంది మనిషికి.

ఈ సేవాపథంలోనే నా జీవితం నిరాటంకంగా సాగిపోవాలని నా అభిలాష. వెనుకటికి మహాత్ములెందరో మహనీయమైన త్యాగాలుచేసి ప్రపంచానికి సేవ చేశారు. ఇప్పుడు మనకు అందుబాటులో ఉన్నంత వరకే సేవచేసి జీవితం చరితార్థకం చేసుకొందాం. మరి నీ ఉద్దేశ్యమేమిటో ఇకమీద.

నేను శాసించవలసినవాడిని కాదు. నువ్వు నిర్ధారణకు రావలసిన సంగతి ఇది.

నువ్వేలా నిర్ణయించుకొన్నా నాకు సమ్మతమే. నువ్వు నాలా ఉండిపోవాలనడం సమంజసం కాదుకాబట్టి; స్త్రీకి కొన్ని ప్రకృతి విధించిన హద్దులు, నియమాలు ఉన్నాయి కాబట్టి వాటిని ధిక్కరించి కూడా నువ్వు నా మార్గంలో సాగివస్తానంటే మరి నేనంతకంటే కోరేదేముంది ?—మదన"

ఉత్తరం పూర్తి చేసేప్పటికి రోహిణి బుగ్గలమీద అశ్రువులు ధారగా కారిపోతున్నాయి. అగ్నిజ్వాలల్లో దహించుకుపోతున్న హృదయంమీద చల్లని అమృత ధారలు కురిసినట్టనిపించింది, మదన వ్రాసిన సంగతులు. ప్రళయ వీచికలలో దారీతెన్నులేక కొట్టుకుపోతున్న ప్రాణికి ఆధారం దొరికినట్టనిపించింది.

అప్పుడప్పుడు మదన విశాలనేత్రాలలో వింతగా మెరిసే ప్రేమదీప్తి గుర్తువచ్చి విచిత్రానుభూతితో పులకరించింది రోహిణి మానసం.

* * *

సేవాసదనం ఆఫీసుగదిలో కూర్చొని కాగితాలు చూస్తూంది రోహిణి.

మదన వచ్చాడు. "నమస్కారం." మునిమునినవ్వు అతడి పెదవులమీద లాస్యం చేస్తూంది.

"కూర్చోండి."

ఎదురుగా కుర్చీలో కూర్చొంటూ ముందుకు జరిపిన రాజీనామా కాగితం చేతికి తీసుకొని, తను వ్రాసిన పంక్తులు కొట్టివేసి క్రింద రోహిణివ్రాసిన పంక్తులు చదువుకొని తృప్తిగా నవ్వుకొంటూ, ప్రేమగా, గాఢంగా చూచాడు రోహిణి ముఖంలోకి.

విషాదమో, ఆనందమో తెలీని బాష్పాలు వినీలనేత్రాలలో నిండి మెరుస్తూంటే ముఖం ఓరగా త్రిప్పుకొంది రోహిణి. ఆమెచేతిని అందుకొని మృదువుగా నొక్కుతూ మరోసారి చదువుకొన్నాడు మదన. "ఈ సేవాసదనం నా తాళిబొట్టు. మీరు నడిచే సేవాపథమే సుమధుర స్వప్నాలు చవిచూపే వైవాహిక జీవితం. కాని, ఏక్షణంలోనూ నన్ను విడవనని మాటివ్వండి. ఒక స్నేహితుడిగా నా ఒంటరిజీవితానికి తోడై నిలుస్తానన్న ప్రగాఢవిశ్వాసంతో—రోహిణి."